

ఓటు హక్కు పై అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న జాయింట్ కలెక్టర్, ఇతర అధికారులు

హిందూపురం : పట్టణంలో బుధవారం ఉదయం 'ఓటు హక్కు పై అవగాహన' ర్యాలీని జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యం సజావుగా సాగాలంటే ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. 18 సంవత్సరాలు పూర్తయిన వారు ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి, తహశీల్దార్ శివ ప్రసాద్ రెడ్డి, సెరికల్చర్ ఎడి సురేష్, ఎంఇఒ గంగప్ప, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ రెడ్డి శేఖర్ పాల్గొన్నారు.



ఎన్నికల నిర్వహణపై ధర్మవరంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ఎన్నికలను సజావుగా నిర్వహిద్దాం

కలెక్టర్ పి.అరుణ్‌బాబు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్ , ధర్మవరం టౌన్

జిల్లాలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలను సజావుగా నిర్వహించేంచేలా అధికారులందరూ సమర్థవంతంగా విధులు నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.అరుణ్ బాబు తెలిపారు. పుట్టపర్తి నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో భాగ్యరేఖతో కలిసి బుధవారం నాడు మంగళకర కళాశాలలో పుట్టపర్తి - 159 అసెంబ్లీ నియోజకవర్గంకు సంబంధించిన పిఒలు, ఏపీవోలకు ఎన్నికల విధుల నిర్వహణపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో పాల్గొనే వారందరూ విధులు, బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఆయా పోలింగ్ స్టేషన్లలో చేపట్టాల్సిన పనులు, ఈవీఎం యంత్రాల పనితీరుపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలింగ్ రోజు సెక్టార్ అధికారుల సమన్వయ సహకారాలతో ఆయా పోలింగ్ కేంద్రాల్లో ప్రిసిడింగ్, సహాయ ప్రిసిడింగ్ అధికారులు చేపట్టాల్సిన విధులను తెలుసుకోవాలన్నారు. పోలింగ్ రోజు పిఒలు, ఏపీవోలు, నిర్ణీత సమయానికి ఆయా పోలీస్ స్టేషన్‌లో ఈవీఎం పనితీరుపై మాక్ పోల్ నిర్వహణ, బ్యాలెట్ కంట్రోల్, వివి ప్యాట్ల కనెక్షన్లు వాటి పనితీరు, ఏవైనా మరమ్మతు జరిగితే వెంటనే తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై సంపూర్ణ అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల విధులపై నిర్వహించే శిక్షణ కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ హాజరు కావాలని, హాజరుకాని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పని చేసే ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేయాలని తెలియజేశారు.


ఎన్నికల నిబంధనల పూర్తి స్థాయిలో పాటించాలి

ధర్మవరం టౌన్ : ఎన్నికలకు సంబంధించి ప్రతి అంశాన్ని క్షున్నంగా పీఒలు, ఏపీఓలు తెలుసుకుని ఎన్నికల నిబంధనల మేరకు నడుచుకోవాలని కలెక్టర్ అరుణ్‌బాబు సూచించారు. బుధవారం ఆర్డీవో కార్యాలయ సమావేశం భవనంలో ధర్మవరం నియోజకవర్గానికి సంబంధించిన పీఒ, ఏపీఓలకు మొదటి విడత శిక్షణ తరగతులకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పోలింగ్ నిర్వహణకు దాదాపు 12వేల మంది సిబ్బందిని నియమించడానికి చర్యలు చేపడుతున్నామన్నారు. ఎన్నికల విధులకు సంబంధించి నిర్వహించే శిక్షణా తరగతులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోలింగ్‌కు ముందు రోజు ధర్మవరం మార్కెట్‌యార్డ్‌లో నియోజకవర్గానికి సంబంధించిన ప్రిసిడింగ్ అధికారులు, సహాయ ప్రిసిడింగ్ అధికారులు ఏపీఓలను ఆయాపోలింగ్ స్టేషన్ విధులకు కేటాయిస్తామన్నారు. జిల్లాలో ఎలాంటి సంఘటనలు జరగకుండా ఎన్నికలు జరిగేలా సిబ్బంది జాగ్రత్తగా వారి విధులు నిర్వర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకట శివారామిరెడ్డి, తహశీల్దార్ రమేష్, మున్సిపల్ కమిషనర్ రాంకుమార్, ట్రైనీలు రాంప్రసాద్, బి.శ్రీనివాసులు పాల్గొన్నారు.



పింఛను కోసం అనంతపురంలోని ఓ సచివాలయంవద్ద వృద్ధుని పడిగాపులు

సామాజిక పింఛన్ల కోసం వృద్ధులు, వికలాంగులు, వితంతవుల పాట్లు అన్నీఇన్నీ కావు. బుధవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి పింఛన్లను సచివాలయాల వద్ద పంపిణీ చేపడతారని చెప్పడంతో ఉదయాన్నే సచివాలయాల వద్దకు లబ్ధిదారులు అందరూ చేరుకున్నారు. సచివాలయాలకు పింఛను డబ్బులు చేరలేదు. దీంతో వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తీవ్రమైన ఎండవేడిమి మధ్య సచివాలయాల వద్ద ఉండలేక సతమతం అయ్యారు. ఇక సచివాలయ ఉద్యోగులు డబ్బుల కోసం బ్యాంకుల వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చింది. సాయంత్రం వరకు వారికి డబ్బులు చేతికందకపోవడంతో పింఛను పంపిణిని మొదటి రోజు సక్రమంగా చేయలేకపోయారు.



పింఛను పాట్లు..!



సోమందేపల్లి సచివాలయం వద్ద ఉదయం పింఛను ఇవ్వకపోవడంతో ఇంటికి వెళ్లిపోతున్న వృద్ధులు

- సిబ్బంది బ్యాంకుల వద్ద.. వృద్ధులు సచివాలయాల వద్ద పడిగాపులు
- ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇదే పరిస్థితి
- సాయంత్రానికి వచ్చిన నగదు
- 5గంటల తర్వాత పంపిణీ ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఎన్నికల కోడ్ ముందు వరకు ప్రతి నెలా 1వ తేదీ ముందే రోజే సచివాలయాల సిబ్బంది బ్యాంకుల నుంచి డబ్బులు డ్రా చేసుకునేవారు. ఉదయాన్నే పింఛన్ లబ్ధిదారులకు ఇంటింటికీ వెళ్లి వాలంటీర్ల చేత డబ్బుల పంపిణీ చేయించేవారు. ఎన్నికలు సమీపించడంతో వాలంటీర్ల ద్వారా పింఛను పంపిణీ చేపట్టవద్దని ఎన్నికల సంఘం ఆదేశించింది. దీంతో సచివాలయాల వద్దనే పింఛన్లు పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఏడు గంటల వరకు పంపిణీ జరుగుతుందని ప్రభుత్వం ప్రకటించింది. మంగళవారం రాత్రికి కూడా డబ్బులు సచివాలయ సిబ్బందికి చేరలేదు. దీంతో సచివాలయ సిబ్బంది బుధవారం ఉదయం నుంచి పింఛను పంపిణీకి అవసరమైన డబ్బుల కోసం బ్యాంకుల వద్దకెళ్లారు. బ్యాంకు ఖాతాల్లోకి డబ్బులు జమకాకపోవడంతో సిబ్బంది బ్యాంకుల వద్ద, వృద్ధులు సచివాలయాల వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. మండుటెండల్లో పింఛను ఎప్పుడొస్తుందా అంటూ ఎదురు చూస్తూ కూర్చోండిపోయారు. మధ్యాహ్నం మూడు గంటలకుపైన కొంత మంది డబ్బులు జమవడంతో డ్రా చేసుకుని సచివాలయ సిబ్బంది సాయంత్రం ఐదు గంటల నుంచి పంపిణీ ప్రారంభించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో మొత్తంగా మొదటి రోజు 25 శాతం వరకు పింఛన్లు పంపిణీ అయ్యాయని అధికారులు చెబుతున్నారు.



చిలమత్తూరు సచివాలయం వద్ద వేచి ఉన్న పింఛను లబ్ధిదారులు

25 శాతం వరకు పంపిణీ

అనంతపురం జిల్లాలో మొత్తం 2,89,131 మంది సామాజిక పింఛను లబ్దిదారులు ఉన్నారు. వీరందరికి కలిపి రూ.86.58 కోట్లు పింఛను డబ్బులు అందాల్సి ఉంది. సాయంత్రానికి బ్యాంకుల నుంచి డబ్బులు డ్రా చేసుకున్న సచివాలయ సిబ్బంది 25 శాతం మంది వరకు పంపిణీని పూర్తి చేశారు. సత్యసాయి జిల్లాలో 2,72,767 మంది లబ్ధిదారులున్నారు. ఇందులో 65 వేల మంది వరకు మొదటి రోజు పంపిణీ పూర్తయింది. దాదాపుగా ఇక్కడ కూడా 25 శాతం మందికి పంపిణీ చేసినట్లు అధికారులు తెలియజేశార. పుట్టపర్తి పట్టణానికి సంబంధించి యూనియన్ బ్యాంకులో డబ్బులు జమకాలేదు. దీంతో అక్కడ బుధవారం నాడు పింఛను పంపిణీ చేయనున్నారు. గురువారం ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఏడు గంటల వరకు పంపిణీ జరుగుతుందని అధికారులు చెబుతున్నారు. మొత్తంగా ఈనెల 6వ తేదీ వరకు పింఛన్ల పంపిణీ కార్యక్రమం కొనసాగనుంది.

38 సచివాలయ ఖాతాలు ఒకే బ్యాంకులో..

హిందూపురం : పురపాలక సంఘం వ్యాప్తంగా 43 సచివాయాల పరిదిలో 13,727 పింఛన్ లబ్ధిదారులు ఉన్నారు. వీరందరికి రూ.4.16,67,000 పంపిణీ చేయాల్సి ఉంది. 43 సచివాలయాల్లో 38 సచివాలయాల ఖాతాలు పట్టణంలోని ఓ ప్రైవేట్ బ్యాంకులో ఉన్నాయి. మిగిలిన 5 ఖాతాల్లో రెండు మరో ప్రయివేటు బ్యాంకులో ఉన్నాయి. మిగిలి మూడు ఖాతాలు మాత్రం ప్రభుత్వ రంగ బ్యాంకులో ఉన్నాయి. లబ్ధిదారులకు ఇవ్వాల్సిన పింఛన్ డబ్బులను ప్రభుత్వం ఆయా బ్యాంకుల్లో ఉన్న ఖాతాలకు జమ చేసింది. అధికారుల ఆదేశాల మేరకు ఆయా సచివాలయాల అడ్మిన్ సెక్రటరీలు డబ్బులను తీసుకురావడానికి బ్యాంకులకు వెళ్లారు. ఒకే బ్యాంకులో 38 ఖాతాలు ఉండడం, అక్కడే రూ.3కోట్లు నగదును డ్రా చేయడానికి సెక్రటరీలు వెళ్లారు. దీంతో బ్యాంకు మేనేజర్ అంత నగదు లేదని, కొంత మందికి మాత్రమే ఇచ్చారు. దీంతో బ్యాంకుల్లో పూర్తి నగదు లబించక పోవడంతో హిందూపురంలోని అన్ని సచివాలయాల్లో పింఛన్ పంపిణీ జరగలేదు.

నీరు..నీడ కరువు..!

పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని సచివాలయాల వద్ద చేపట్టడంతో వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎండ వేడమికి కనీసం కూర్చొవడానికి స్థలం లేక అల్లాడిపోయారు. తాగేందుకు నీరు లేక గొంతు తడారిపోయింది. ఏ సచివాలయంలో కూడా అధికారులు నీడ కోసం సేమియానా, తాగునీటి వసతి కల్పించలేదు. పెద్ద సంఖ్యలో వృద్ధులు, మహిళలు సచివాలయం వద్దకు వస్తారని ముందుగా తెలిసినా అధికారులు వారి కోసం నీడ, నీటి వసతి ఏర్పాటు చేకపోవడంపై పింఛన్‌దారులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్‌తోనే సుపరిపాలన సాధ్యం

పుట్టపర్తి అభ్యర్థి దాదిరెడ్డి మధుసూదన్ రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మధుసూదన్ రెడ్డి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

దేశం, రాష్ట్రంలో సుపరిపాలన కొనసాగాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యమని పుట్టపర్తి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి దాదిరెడ్డి మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక సాయి మా హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరులతో ఆయన మాట్లాడుతూ తాను మొదటి నుంచి కాంగ్రెస్‌లో ఉంటూ వైఎస్ అభిమానిగా ఉన్నాయని తెలియ జేశారు. ఆ తరువాత వైసిపిలో చేరానని, ఆ పార్టీలో ఇమడ లేక బయటకి వచ్చానని తెలియ జేశారు. జగన్ కేసులకు భయపడి మోడీ వద్ద సాష్టాంగ నమస్కారాలు చేస్తున్నారని విమర్శించారు. ప్రత్యేక హోదా, విభజన ప్రయోజనాలు సాధించడంలో జగన్మోహన్ రెడ్డి పూర్తిగా విఫలం అయ్యాడన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం వచ్చిన వైఎస్ షర్మిల నాయకత్వాన్ని గుర్తించి తాను కాంగ్రెస్ పార్టీలో చేరానన్నారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా, విప్‌గా పనిచేసిన పల్లె రఘునాథ రెడ్డి నియోజక వర్గంలో ఎలాంటి అభివద్ధి చేయలేదన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి 193 చెరువులకు నీరు ఇస్తామని ప్రగల్బాలు పలికి ఎన్నికల ముందు తూతూమంత్రంగా భూమిపూజ చేసి జిమ్మిక్కులు చేశారన్నారు. జగన్‌కు ప్రజాధరణ ఉంటే సిద్ధం సభలకు వందల కోట్లు ప్రజాధనం ఎందుకు దుర్వినియోగం చేస్తున్నారని ప్రశ్నించారు. మద్యపానం నిషేధం చేస్తానని చెప్పిన జగన్ ప్రాణాంతకరమైన నాసిరకం మద్యాన్ని తెచ్చి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రత్యేక హోదా రాష్ట్రానికి వస్తుందన్నారు. ప్రతి మహిళకు ఏడాదికి లక్ష రూపాయల సాయం అందిస్తామన్నారు. రైతులకు రూ.రెండు లక్షల పంట రుణం మాఫీ చేస్తామన్నారు. పుట్టపర్తి నియోజకవర్గంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి కల్పిస్తామన్నారు. ఈ ఎన్నికలలో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కోటా సత్యం, నల్లమాడ గౌస్ బాషా, పట్టణ కన్వీనర్ పుట్ల గంగాద్రి, లక్ష్మీనారాయణ, వాసుదేవ రెడ్డి, శ్రీధర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

శ్రీసత్యసాయి అనువాదకులు అనిల్ కుమార్ మృతి



మతి చెందిన ప్రొఫెసర్ అనిల్ కుమార్ (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

పుట్టపర్తి శ్రీసత్యసాయి బాబా బోధనలు, ఉపన్యాసాలను ఆంగ్లంలో అనువదించే అనువాదకులు ప్రొఫెసర్ అనిల్ కుమార్(80) మతి చెందారు. హదయ సంబంధిత వ్యాధితో బాధపడుతూ సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మతి చెందారు. సుదీర్ఘకాలంగా సత్యసాయిబాబా అనువాదకులుగా అనిల్‌కుమార్ సేవలు అందించారు. ఆయన మతి పట్ల బాబా భక్తులు దిగ్భ్రాంతి చెందారు. అనిల్‌కుమార్ దేశ విదేశీయులకు సుపరిచితం అయిన వ్యక్తి. ఆయన మృతి పట్ల పలువురు సంతాపం తెలియజేశారు.

కులం,మతంతో వైసిపి రాజకీయచిచ్చు

- పుంగనూరు పెత్తనాన్ని కదిరిలో జరగనివ్వం
- కదిరి కూటమి అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్

ప్రజాశక్తి-కదిరి టౌన్

రాష్ట్రంలో ముస్లిం, మైనార్టీలు ఎక్కడైతే అధికంగా ఉన్నారో ఆ నియోజక వర్గాలలో ఎన్డీఏ అభ్యర్థులు పోటీ చేస్తున్న చోట కులం, మతం రంగు ప్రజలపై రుద్ది రాజకీయ లబ్ధి పొందడం కోసం వైసిపి ప్రయత్నిస్తోందని కదిరి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ విమర్శించారు. బుధవారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కందికుంట మాట్లాడుతూ కదిరి నియోజకవర్గ ప్రజలు పుంగనూరు పెత్తనాన్ని సహించరన్నారు. వైసీపీ హయాంలో అప్పుల పాలైన రాష్ట్రాన్ని అభివద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లడానికి టిడిపి కృషి చేస్తుందన్నారు. సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలన్న లక్ష్యంతోనే టిడిపి, జనసేన బిజెపి పార్టీలు కూటమిగా ఏర్పడినట్లు స్పష్టం చేశారు. ఒక ఛాన్స్ పేరుతో అధికారం చేపట్టిన జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరాచక పాలనను త్వరలోనే అంతం కానుందన్నారు. రాష్ట్రానికి, ప్రజలకు మేలు జరగాలంటే ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. వైసిపి ఓట్ల కోసం మైనార్టీలను రెచ్చగొట్టే విధంగా రాజకీయాలు చేస్తుండడం సిగ్గుచేటన్నారు. ముస్లిం మైనార్టీల హక్కులను కాపాడే బాధ్యత టీడీపీ తీసుకుంటుందని భరోసా కల్పించారు. హంద్రీనీవా సుజల స్రవంతి ద్వారా కదిరి నియోజకవర్గంలో చెరువులకు నీళ్లు అందించామని, మిగిలిన చెరువులకు నీళ్లు ఇస్తామని స్పష్టం చేశారు. టిడిపి ప్రభుత్వం వచ్చిన వెంటనే పింఛన్లను రూ.4000కు పెంచి ఇంటి వద్దనే పంపిణీ చేస్తామని తెలియజేశారు. సూపర్-6 ద్వారా ప్రతి ఒక్కరికీ లబ్ది చేకూరుస్తామని తెలియజేశారు. ఈ సమావేశంలో జనసేన ఇన్‌ఛార్జి భైరవ ప్రసాద్, టీడీపీ నాయకులు పవన్ కుమార్ రెడ్డి, బిజెపి అసెంబ్లీ ఇన్‌ఛార్జి వేణుగోపాల్ రెడ్డి, జనసేన నాయకులు లక్ష్మన్న, అశ్వర్థ కుమార్, మహేష్ పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న కందికుంట వెంకటప్రసాద్

బాల్య వివాహాలను అరికడదాం

ప్రజాశక్తి-పుట్టపర్తి

బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా ఐసిడిఎస్ పిడి లక్ష్మి కుమారి, పుట్టపర్తి డీఎస్పీ శ్రీనివాసులు సూచించారు. మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం కొత్తచెరువు ఆర్డీటీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడంలో ఎపి దేశంలోనే ప్రథమ స్థానంలో ఉందని సర్వేల్లో తేలిందన్నారు. బాల్య వివాహాల నిర్మూలనకు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. బాల్య వివాహం చేయడం, సహకరించడం చట్టరీత్యా నేరమన్నారు. బాల్య వివాహం సమాచారం తెలిస్తే 1098కి, 100 కి ఫోన్ చేసి తెలపాలన్నారు. సమావేశంలో జిల్లా అధికారులు సుబ్బారెడ్డి, శివశంకరప్రసాద్, మహేష్, నాగలక్ష్మి, మురళీధర్, రాజకుమార్, సునీత, సుధాకర్, ఐసిడిఎస్ సూపర్వైజర్లు పాల్గొన్నారు.

పింఛను పంపిణీ ఆలస్యంపై నిలదీత

ప్రజాశక్తి-గోరంట్ల

మండలంలో సామాజిక పింఛన్లు మధ్యాహ్నం 3 గంటలైనా పంపిణీ చేయకపోవడంపై మండల టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పట్టణంలోని సచివాలయం-1 వద్ద ఎంపిడిఒ ప్రవీణ్‌కుమార్‌ను నిలదీశారు. నాయకులు మాట్లాడుతూ వెంటనే ఇంటింటికీ వెళ్లి పింఛనుదారులకు పింఛను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఎంపిడిఒ మాట్లాడుతూ పింఛను సొమ్ము బ్యాంకుల్లో జమ కాకపోవడం తో పంపిణీలో ఆలస్యమైందని తెలిపారు. బ్యాంకులో నగదు జమ అయిన వెంటనే డ్రా చేసి సచివాలయం వద్ద సచివాలయం ఉద్యోగులతో పంపిణీ చేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు శ్రీనివాసులు, వేణు, జయరాం, హంపయ్య, జనసేన పార్టీ నాయకులు సంతోష్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ ఉపాధ్యాయుడికి సన్మానం

ప్రజాశక్తి-గాండ్లపెంట

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మండలంలోని రెక్కమాను ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు జి.రామచంద్రరెడ్డి, ఆయన భార్య అక్కులమ్మను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథులుగా ఎంపిడిఒ కె.రామానాయక్, ఎంఇఒలు బి.కృష్ణానాయక్, శ్రీనివాసులు హాజరై ఉపాధ్యాయుడి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి హెచ్‌ఎం పామిడి ముంతాజ్ అలీ, ఉపాధ్యాయులు జి.రామ్మోహన్, రాజశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

వికలాంగులకు ప్రత్యేక శిబిరం

మడకశిర : పట్టణంలోని బాలికల వసతి గృహం ఆవరణలో బుధవారం వికలాంగులకు ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను ఆర్థోపెడిక్ డాక్టర్ డేవిడ్ రాజు, ఆడియాలజిస్ట్, సైకాలజిస్ట్ డాక్టర్లు పరీక్షలు చేసి ఏ ఉపకరణం అవసరమో నిర్ధారణ చేశారు. 360 మంది పిల్లలు, జిల్లా ఐఈడి కోఆర్డినేటర్ ఆనంద్ బాబు, సిడిపిఒ నాగమల్లేశ్వరి, మండల అధికారులు, డాక్టర్లు సహిత, విద్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ శిబిరం ఏర్పాటుపై తగినంత ప్రచారం చేయలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

అంగన్వాడీ విద్యార్థులకు దుస్తులు పంపిణీ

పరిగి : పరిగిలోని 3 అంగన్వాడీ కేంద్రాల చిన్నారులకు బుధవారం దివ్య ఎడ్యుకేషన్ ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు పరిగి వేణుగోపాల్‌రావు దుస్తులు పంపిణీ చేశారు. తన కుమార్తె దివ్య వర్థంతి సందర్భంగా 250 మంది చిన్నారులకు నూతన దుస్తులు పంపిణీ చేసి, భోజన సదుపాయం కల్పించారు. ఆయన మాట్లాడుతూ 2015లో తన కుమార్తె అనారోగ్యంగా మృతి చెందిందని, ఆమె స్మారకార్థం 9 ఏళ్ల నుంచి అంగన్వాడీ విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేస్తున్నానని తెలిపారు.

కొనసాగుతున్న వాలంటీర్ల రాజీనామాలు

ప్రజాశక్తి-గోరంట్ల రూరల్

గ్రామ, వార్డు వాలంటీర్లు ఎన్నికల ప్రచారం, మరే ఇతర కార్యక్రమాల్లో పాల్గొనకూడదనిఇటీవల ఎన్నికల కమిషన్ ఆదేశాలు ఇవ్వడంతో జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల వాలంటీర్ల రాజీనామాల బాట పట్టారు. అందులో భాగంగా మండలంలో బుధవారం 73 మంది వాలంటీర్లు ఎంపిడిఒ కార్యాలయంలో రాజీనామా లేఖలు సమర్పించారు. వానవోలు సచివాలయం-1 పరిధిలో 32 మంది, వానవోలు-2లో ఏడుగురు, నార్సింపల్లి పంచాయతీలో 11 మంది ఎంపిడిఒ కార్యాలయంలో ఎఒ సూర్యనారా యణకు రాజీనామా పత్రాలు అందజేశారు. పాలసముద్రం సచివాలయ పరిధిలో 23 మంది వాలం టీర్లు సచివాలయ కార్యదర్శికి రాజీనామా పత్రాలు అందజేశారు. వారు విలేకరులతో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై ఎపికి జగన్‌ను మరోమారు సిఎం చేయాలన్న లక్ష్యంతో ఆయనకు అండగా నిలబడానికి తమ పదవులకు రాజీనామా చేస్తున్నామని తెలిపారు.

పెనుకొండ రూరల్ : మండలంలోని దుద్దేబండ పంచాయతీలో 18 మంది వాలంటీర్లు రాజీనామా చేశారు.

గోరంట్ల : మండలంలోని వానవోలు గ్రామ సచివాలయం-1,2లో పనిచేస్తున్న 39 మంది వాలంటీర్లతో పాటు నర్సంపల్లి గ్రామపంచాయతీలో 13మంది బుధవారం మూకుమ్మడిగా రాజీనామా చేశారు. ఆ పత్రాలను ఎంపిడిఒ కార్యాలయ ఎఒ సూర్యనారాయణకు అందజేశారు. వాలంటీర్లు మాట్లాడుతూ ఎవరి ఒత్తిడి లేకుండా వాలంటీర్ పోస్టుకు రాజీనామా చేసినట్లు వారు తెలిపారు.

ఓబుళదేవరచెరువు : మండలంలో వివిధ సచివాలయాల్లో పని చేస్తున్న 21 మంది వాలంటీర్లు రాజీనామా లేఖలను ఎంపిడిఒ వరలక్ష్మికి అందజేశారు. చింతమానుపల్లి పంచాయతీలో 11మంది, తంగేడుకుంట పంచాయతీలో ఆరుగురు, కొండమాల పంచాయతీలో ఇద్దరు, ఓడిచెరువులో ఇద్దరు రాజీనామా చేశారు.



గోరంట్లలో రాజీనామా పత్రాలను ఎంపిడిఒ కార్యాలయ ఎఒ సూర్యనారాయణకు అందిస్తున్న వాలంటీర్లు

టిడిపితోనే పేదల సంక్షేమం

హిందూపురం : టిడిపితోనే పేదల సంక్షేమం సాధ్యం అని ఆ పార్టీ నాయకులు తెలియజేశారు. బుధవారం పట్టణం, రూరల్ మండల వ్యాప్తంగా టిడిపి నాయకులు సూపర్ సిక్స్ పథకాల గురించి ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా నందమూరి బాలకష్ణ, ఎంపీగా బికె.పార్థసారథిలకు ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు డిఇ.రమేష్ కుమార్, క్లస్టర్ ఇన్‌ఛార్జి చంద్రమోహన్ యాదవ్, బాబా ఫక్రుద్దీన్, వార్డ్ ఇన్‌ఛార్జి నారాయణరెడ్డి, బూత్ ఇన్‌ఛార్జి శ్రీనివాస్ రెడ్డి, బాబా ఫక్రుద్దీన్, నాగేంద్ర, సీనియర్ నాయకులు చెన్నకృష్ణ, ఎంజీ రంగప్ప, నాగేష్, జయ రాములు, పురుషోత్తం రెడ్డి, నటరాజు, బాబావలి పాల్గొన్నారు.

పాఠశాలల్లో వాటర్ బెల్స్ : ఎంఇఒలు

ధర్మవరం టౌన్ : ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ఇక నుండి మండల వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో వాటర్ బెల్స్‌ను ప్రారంభిస్తామని ఎంఇఒలు గోపాల్‌నాయక్, రాజేశ్వరి దేవి తెలిపారు. వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో డీహైడ్రేషన్ ముప్పును నివారించేందుకు రోజులో 3 సార్లు బెల్స్ మోగించాలని ఆదేశాలు అందినట్లు తెలిపారు. ఉదయం 8:45, 10:50, 11:50కు గంట కొట్టా లని వారు తెలిపారు.

కెజిబివిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

గాండ్లపెంట : నంబులపూలకుంటలో ఉండే స్థానిక కస్తూర్బా గురుకుల బాలిక విద్యాలయలో 6వ తరగతి, ఇంటర్ ప్రవేశానికి ఈ నెల 11వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ రిహాన్ తెలిపారు. దరఖాస్తు చేసిన ఓ పత్రాన్ని కెజిబివిలో అందజేయాలని సూచించారు.

సోషల్ మీడియాలో పోస్టులపై ప్రత్యేక నిఘా : ఎస్పీ

ప్రజాశక్తి-పుట్టపర్తి

ఎన్నికల వేళ సోషల్ మీడియాలో రెచ్చగొట్టేలా పోస్టులు పెడుతున్న వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని సోషల్ మీడియా, సైబర్ క్రైమ్ సిబ్బందిని ఎస్పీ మాధవరెడ్డి ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఉన్న సోషల్ మీడియా, సైబర్ క్రైమ్ కార్యాలయాన్ని బుధవారం ఎస్పీ పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. సోషల్ మీడియా, సైబర్ క్రైమ్‌లో నమోదవుతున్న ఫిర్యాదులు, తదితర విషయాలను ఎస్పీకి సిఐ వివరించారు. ఎస్పీ వెంట అదనపు ఎస్పీ ఎస్.విష్ణు, సైబర్ క్రైమ్ సిఐ హేమంత్ కుమార్, సిబ్బంది రవి ఉన్నారు.



సోషల్ మీడియా కార్యాలయాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ

ఉద్యోగ విరమణ అధికారులకు సన్మానం

సుదీర్ఘకాలం పోలీస్ వ్యవస్థలో మీరు అందించిన సేవలు చిరస్మరణీయమని ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి పేర్కొన్నారు. పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందిన వారిని బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో పోలీసు అధికారులు ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథులుగా ఎస్పీ మాధవరెడ్డి, ఎస్పీ ఎస్ విష్ణు హాజరై వారి సేవలను కొనియాడారు. ఉద్యోగ విరమణ పొందిన కుళ్లాయి స్వామి, సుబ్బారెడ్డి, కృష్ణకుమార్, ఇస్మాయిల్‌కు వారు పూలమాల వేసి శాలువాతో సత్కరించి మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో ఎఒ సుజాత, సూపరింటెండెంట్ సరస్వతి, సైబర్ క్రైమ్ సిఐ హేమంత్‌కుమార్, ఆర్‌ఐలు రవికుమార్, వలి, ఎఎస్ఐలు శ్రీరాములు, అమీర్, జిల్లా పోలీస్ కార్యాలయ, డిపిఒ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణపై పిఒలు, ఎపిఒలకు శిక్షణ

ప్రజాశక్తి-హిందూపురం

సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై బుధవారం పట్టణంలోని చిన్మయ విద్యాలయంలో జాయింట్ కలెక్టర్, ఆర్ఒ అభిషేక్ కుమార్ ఆధ్వర్యంలో పిఒలు, ఎపిఒలకు శిక్షణ ఇచ్చారు. పిఒలు, ఎపిఒలు తొలుత మాక్ పోల్ నిర్వహించి, అన్నీ సక్రమంగా ఉంటేనే ఎన్నికలు నిర్వహించాలన్నారు. సమస్య తలెత్తితే వెంటనే ఆర్ఒకు తెలియజేయాలన్నారు. వివి ప్యాట్ పనిచేయకపోతే దానిని మాత్రమే మార్చాలన్నారు. ఈవిఎం సరిగా పనిచేయకపోతే మొత్తం కంట్రోల్ ప్యానల్‌ను మార్చాలన్నారు. పోలింగ్ స్టేషన్‌లో ఓటు హక్కు వినియోగించుకోవడానికి వచ్చే వారు 11 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి చూపించాలన్నారు. రేషన్‌కార్డు, ఆరోగ్యశ్రీకార్డు, పట్టదారు పాసుపుస్తకం అనుమతించరాదన్నారు. చాలా జాగ్రత్తగా ఎన్నికలు నిర్వహించాలన్నారు. శిక్షణలో మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి, తహశీల్దార్ శివప్రసాద్‌రెడ్డి, సెరికల్చర్ ఎడి సురేష్, ఎంఇఒ గంగప్ప, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ రెడ్డిశేఖర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



పిఒలు, ఎపిఒలకు శిక్షణ ఇస్తున్న జెసి అభిషేక్ కుమార్

చంద్రబాబు వల్లే పింఛనుదారులకు ఇబ్బందులు

వైసిపి ఎంపి, ఎమ్మెల్యే అభ్యర్థులు

ప్రజాశక్తి-మడకశిర

ప్రతి నెలా 1వ తేదీన ఇంటి వద్దకే పింఛన్లు అందిస్తున్న వాలంటీర్లపై టిడిపి అధినేత చంద్ర బాబు రాజకీయ దురుద్దేశంతో ఫిర్యాదు చేసి అడ్డుకోవడం వల్లనే వృద్ధులు, వికలాంగులు నేడు ఇబ్బందులకు గురికావాల్సిన పరిస్థితి ఏర్పడిందని హిందూపురం ఎంపి, మడకశిర ఎమ్మెల్యే వైసిపి అభ్యర్థులు శాంతమ్మ, ఈరలక్కప్ప పేర్కొన్నారు. వారు బుధవారం పట్టణంలోని రవిశేఖర్‌రెడ్డి నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జన్మభూమి కమిటీలతో సొంత పార్టీ నేతలకు పింఛన్లు అందించిన ఘనత చంద్రబాబుది అయితే, గడప గడపకూ వెళ్లి అర్హతే ప్రామాణికంగా పింఛన్ పంపిణీ చేసిన ఘనత జగన్‌ది అన్నారు. టిడిపి అంటేనే కుట్ర రాజకీయాలకు ప్రసిద్ధి అన్నారు. టిడిపి నీచమైన రాజకీయాలను ప్రజలు గ్రహిస్తున్నారు, త్వరలోనే గట్టిగా బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో శివకుమార్, సర్పంచి వాగేష్, హల్కూరు కాంతరాజు, నిర్మలరవిశేఖర్‌రెడ్డి, అనిత పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి అభ్యర్థి శాంతమ్మ

బిసిలకు భరోసా ఇచ్చేందుకే 'జయహో బిసి'

ప్రజాశక్తి-మడకశిర

బిసిలకు భరోసా ఇచ్చేందుకే టిడిపి ఆధ్వర్యంలో జయహో బిసి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టిడిపి కురుబ విభాగం రాష్ట్ర కన్వీనర్ వి.ఎం. పాండురంగప్ప, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్ కుమార్ తెలిపారు. పట్టణంలోని పార్టీ కార్యాలయం సమీపంలో బుధవారం నిర్వహించిన జయహో బిసి సదస్సులో వారు మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలో బిసిలకు రక్షణ కరువైందని, వారికి రక్షణ కల్పించే దిశగా భరోసా ఇచ్చేందుకు టిడిపి ఆధ్వర్యంలో జయహో బిసి కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. వారు మీడియాతో మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ కల్పించిన ఘనత టిడిపికి దక్కగా, సిఎం జగన్ 34 శాతం ఉన్న రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించి బిసిలకు అన్యాయం చేశారన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే ఈరన్న, సునీల్ కుమార్ నాయకులు, కార్యకర్తలు పట్టణంలో వీధుల గుండా ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టిడిపికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పాండురంగప్ప, రామకృష్ణయాదవ్, ఆదినారాయణ, అశ్వత్థప్ప, బొజ్జప్ప, సురేష్, ఓబులేసు, మాధవరాజు, పుల్లయ్యచౌదరి, ప్రకాష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సునీల్‌కుమార్

టిడిపి నాయకుల విస్తృత ప్రచారం

ప్రజాశక్తి- గాండ్లపెంట

టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తుందని వెలిచలమల టిడిపి నాయకుడు బసిరెడ్డి తెలిపారు. ఆయన బుధవారం నంబులపూలకుంటలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబు సిఎం అయితే 20 లక్షల ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ భృతి రూ. 3 వేలు, తల్లికి వందనం పేరుతో ఏడాదికి రూ. 15 వేలు, అన్నదాతలకు రూ. 20వేలు, ఇంటింటికీ 3 సిలిండర్లు, ప్రతి ఇంటికీ నీటి కుళాయి, ఆడబిడ్డ పథకం కింద 18 – 59 ఏళ్ల లోపు మహిళలకు పలు పథకాలు అమలు చేస్తారని వివరించారు. ప్రజలు వైసిపికి ఓటుతో గట్టిగా బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

పరిగి : మండలంలోని మోదా, గొరవనహళ్లి, చేర్లోపల్లి, ఆనందపాల్యం గ్రామాల్లో టిడిపి మండల నాయకులు విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలకు కల్పించే సంక్షేమ పథకాలను, వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు శివ, రమేష్, టిడిపి నాయకులు సూర్యనారాయణ, సత్యనారాయణ, బాలాజీ, మోదా రవి, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్, ఈశ్వరప్ప, మారుతి పాల్గొన్నారు.

టిడిపి నుంచి వైసిపిలో చేరిక

ప్రజాశక్తి-హిందూపురం

చిలమత్తూరు మండలంలోని మొరసలపల్లి గ్రామపంచాయతీకి చెందిన పలువురు టిడిపి నాయకులు బుధవారం వైసిపి నాయకులు వేణురెడ్డి సమక్షంలో స్థానిక వైసిపి కార్యాలయంలో వైసిపిలో చేరారు. వారిలో గొల్ల సోమశేఖర్, టిడిపి బిసి సెల్ కార్యదర్శి ఈశ్వరప్ప, రామకృష్ణ, ఈశ్వరప్ప, చంద్ర, నారాయణస్వామి, హరిప్రసాద్, మంగళ నారాయణ స్వామి, శ్రీనివాసులు, దేవరాజు, సురేష్, ఎం.నారాయణస్వామి, చాకలి రామంజనేయులు, వై.రామాంజనేయులు, వెంకటేష్, వాల్మీకి రామంజి, తదితర 20 కుటుంబాలు టిడిపి నుంచి వైసిపిలో చేరాయి. వారికి వేణురెడ్డి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. చేరిన వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే బాలకృష్ణ కార్యకర్తలను విస్మరించారన్నారు. సిఎం జగన్ పాలన నచ్చి వైసిపిలో చేరామన్నారు. కార్యక్రమంలో ఎంపిపి పురుషోత్తంరెడ్డి, సర్పంచి ఈరప్ప, సుధాకర్‌రెడ్డి, నాయకులు శేఖర్, త్యాగరాజు, హనుమంతరెడ్డి, గోవిందరెడ్డి పాల్గొన్నారు.



టిడిపి నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న వేణురెడ్డి

వైసిపిలో పలువురు చేరిక

పెనుకొండ రూరల్ : పట్టణంలోని ఉషశ్రీచరణ్ క్యాంపు కార్యాలయంలో బుధవారం పరిగి మండలంలోని పెద్దరెడ్డిపల్లి గ్రామానికి చెందిన 15 టిడిపి కుటుంబాలు వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెవి.ఉషశ్రీచరణ్ భర్త చరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో వైసిపిలో చేరారు. వారికి చరణ్ రెడ్డి వైసిపి కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

గోరంట్ల రూరల్ : మండలంలోని ఎముకలగుట్లపల్లి గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు ఎం.లక్ష్మిరెడ్డి కొద్ది రోజులుగా గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న మంత్రి ఉషశ్రీచరణ్ భర్త చరణ్‌రెడ్డి బుధవారం లక్ష్మిరెడ్డి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆయనతో పాటు పాటూరి శంకర్ రెడ్డి, శివారెడ్డి, జడ్పిటిసి బాలాజీరామ్‌నాయక్, సర్పంచి శివమణిరెడ్డి, వార్డ్ మెంబర్ జగన్‌రెడ్డి, వీరనారాయణరెడ్డి, శరత్‌కుమార్‌రెడ్డి, జయపాల్‌రెడ్డి, సమరసింహారెడ్డి ఉన్నారు.

పింఛన్ల పంపిణీలో కావాలనే జాప్యం

ప్రభుత్వంపై పల్లె మండిపాటు

ప్రజాశక్తి-కొత్తచెరువు రూరల్

జగన్ ప్రభుత్వం పింఛన్ల పంపిణీలో కావాలనే జాప్యం చేస్తూ వృద్ధులు, వితంతు, వికలాంగుల ను ఇబ్బందిపెడుతోందని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి విమర్శించారు. వాలంటీర్లు లేరనే సాకుతో టిడిపిపై వ్యతిరేక తెచ్చేలా జగన్ ప్రభుత్వం భారీ కుట్రకు పాల్పడుతోందన్నారు. టిడిపి అధికారంలోకి రాగానే వాలంటీర్ల ద్వారా ప్రతినెలా 1వ తేదీనే రూ. 4 వేల పింఛను అందిస్తామని భరోసా ఇచ్చారు. కొత్తచెరువు మండలంలోని బండ్లపల్లి పంచాయతీ ఎర్రపల్లి గ్రామంలో బుధవారం నిర్వహించిన జయహో బిసి సమావేశంలో పలు వైసిపి కుటుంబాలు మాజీ మంత్రి పల్లె, హిందూపురం, పుట్టపర్తి టిడిపి ఎంపి, ఎమ్మెల్యే అభ్యర్థులు బికె.పార్థసారథి, పల్లె సింధూర సమక్షంలో టిడిపిలో చేరారు. కురుబ కిష్ట, రమాదేవితో పాటు 35 కుటుంబాల సభ్యులకు వారు టిడిపి కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అంతకుముందు పల్లె సింధూరకు మహిళలు హారతులు పట్టగా గ్రామస్తులు డప్పులు వాయిస్తూ బాణసంచా పేలుస్తూ పూల వర్షం కురిపించి అపూర్వ స్వాగతం పలికారు. పల్లె మాట్లాడు తూ ప్రజలు ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి టిడిపి ఎంపి, ఎమ్మెల్యే అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. పల్లె సింధూరరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని 193 చెరువులను నీటితో నింపుతామని హామీ ఇచ్చారు. యువత కోసం పరిశ్రమల ఏర్పాటుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిం చామన్నారు. అనంతరం గ్రామాల్లో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పల్లె వెంకట కృష్ణ కిషోర్ రెడ్డి, ఎస్.శ్రీనివాసులు, సామకోటి ఆదినారాయణ, రామకృష్ణ, వలిపి శ్రీనివాసులు, మాణిక్యం బాబా, బండ్లపల్లి కిష్టప్ప, రమేష్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, శేషప్ప, రామ్మోహన్, కిరణ్, రాహుల్, వెంకటేష్, ఆర్.నాగేంద్ర, కిష్ట, రమాదేవి పాల్గొన్నారు.



ప్రచారంలో మాట్లాడుతున్న పల్లె సింధూర, చిత్రంలో పల్లె, బికె పార్థసారథి

చంద్రబాబుకు ప్రజాకోర్టులో శిక్ష తప్పదు

ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ప్రతి ఇంటి వద్దకు వచ్చి వాలంటీర్ల ద్వారా పింఛన్లు అందించి అవ్వ, తాతలకు చేయూత నందిస్తుంటే ఓర్వలేక కుట్రలు చేసి ఆపివేయించిన చంద్రబాబుకు ప్రజాకోర్టులో శిక్ష తప్పదని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని వైసిపి కార్యాలయంలో బుధవారం 32వ వార్డు ఇన్‌ఛార్జి చిల్లా భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో 305 కుటుంబాలు, 19వ వార్డు ఇన్‌ఛార్జి కేశగాళ్ల క్రిష్ణ ఆధ్వర్యంలో 109 కుటుంబాలు వైసిపిలో చేరాయి. చేరిన వారిలో నిమ్మల నాగభూషణం, వీరాంజనేయులు, జనార్ధన్, నాగేంద్ర, యువకుమార్, మన్నీల చలపతి, వెంకటయ్య, రాంబాబు, సుభద్రమ్మ, పార్వతమ్మ, పెద్దన్న, కొండన్నతో పాటు పలువురికి ఎమ్మెల్యే కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కేతిరెడ్డి మాట్లాడుతూ సిఎం జగన్ 99శాతం హామీలను అమలు చేసి జనరంజక పాలన అందించారన్నారు. కార్యక్రమంలో 32వ వార్డు కౌన్సిలర్ చిల్లా శారద, వార్డు ఇన్‌ఛార్జి చిల్లా భాస్కర్‌రెడ్డి, 19వవార్డు కౌన్సిలర్ కేశగాళ్ల క్రిష్ణవేణి, వార్డు ఇన్‌ఛార్జి కేశగాళ్ల క్రిష్ణ, కోటిరెడ్డి బాలిరెడ్డి, నీలూరి ప్రకాష్, సానే రాజారెడ్డి, వంట రమేష్, ఉడుముల రాము, చాంద్‌బాషా, గజ్జల శివ, పెద్దిరెడ్డి శ్రీనివాసులు, చింతకాయల నరేష్, కనేకంటి శివారెడ్డి, జింకా రాఘవేంద్ర, తొండమాల రవి, సుబహాన్, కాశీ, ముక్తం మణిదీప్, ముక్తం ఈశ్వరయ్య, తోపుదుర్తి వెంకటరాముడు, తీర్థాల రమణ, అమీర్ బాషా, చందమూరి శివారెడ్డి పాల్గొన్నారు.



కేతిరెడ్డి సమక్షంలో వైసిపిలో చేరిన నాయకులు

వంద వైసిపి కుటుంబాలు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-తనకల్లు

మండలంలోని మొగిలిచెట్లతండా, దేవలంతండా, భీమ్లానాయక్‌తండా, బాబేనాయక్‌తండా, ఏనుగుగుండుతండా, నడిమితండా, గుట్టమీదతండా, రామప్పకుంటతండాలకు చెందిన సుమారు వంద కుటుంబాలు వైసిపిని వీడి గేమేనాయక్‌తండా సర్పంచి మూడే కాంతమ్మ ఆధ్వర్యంలో బుధవారం కదిరి పట్టణంలోని ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ నివాసంలో టిడిపిలో చేరారు. వారికి కందికుంట టిడిపి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కందికుంట మాట్లాడు తూ వచ్చే ఎన్నికల్లో టిడిపి అత్యధిక స్థానాల్లో గెలిచి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని, చంద్రబాబు ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, అన్ని వర్గాలకు సముచిత న్యాయం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ తొట్లిరెడ్డి శేఖర్‌రెడ్డి, బీగం శంకర్ నాయుడు, ఆనందరెడ్డి, బాగేపల్లి చలపతి, సర్పంచి మూడే కాంతమ్మ, మూడే ఉత్తన్న నాయక్, శ్రీరాములు నాయక్ పాల్గొన్నారు.



కందికుంట సమక్షంలో టిడిపిలో చేరిన నాయకులు

'కందికుంట' ఎన్నికల ప్రచారం

తలుపుల : మండలంలోని పెద్దన్నవారిపల్లి, పులోళ్లపల్లి, వేమలగొంది, కొట్టాల, మైరాడా, ఎం.వడ్డిపల్లి, పెద్దన్నవారిపల్లిలో బుధవారం కదిరి నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఆయా గ్రామాల్లో కందికుంటకు ఆడపడుచులు హారతి పట్టగా ప్రజలు నీరాజనం పట్టారు. యువత గజమాలతో స్వాగతం పలికారు. కందికుంట ఇంటింటికీ వెళ్లి టిడిపి పథకాలను వివరిస్తూ సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఆయన వెంట జనసేన ఇన్‌ఛార్జి భైరవ ప్రసాద్, టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



టిడిపిలో చేరిన వారితో నాయకులు

వైసిపి నుంచి టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-హిందూపురం

లేపాక్షి మండలంలోని కొండూరు గ్రామంలో వైసిపికి చెందిన ప్రముఖ నాయకులు బుధవారం టిడిపిలో చేరారు. కొండూరు గ్రామ మాజీ సర్పంచి శివప్ప, తిమ్మగానిపల్లి వెంకటేష్, వైసిపి నేత కిష్టప్ప ఆధ్వర్యంలో 50 కుటుంబాలు పట్టణంలోని ఎమ్మెల్యే బాలకృష్ణ నివాసంలో నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు సమక్షంలో టిడిపిలో చేరారు. వారు మాట్లాడుతూ వైసిపి కోసం తాము ఎంతో కష్టపడ్డామని, తగిన గుర్తింపు లేని పార్టీలో ఉండలేక టిడిపిలో చేరామన్నారు. నేటి నుంచి టిడిపిని మరింత బలోపేతం చేసేందుకు నిరంతరం కృషి చేస్తామన్నారు. చేరిన వారిలో బోయ ప్రసాద్, అశ్వత్థప్ప, నరసింహప్ప, గంగాధరప్ప, వి.ఆదినారాయణ, 1వ వార్డు సభ్యులు గోపాలప్పతో పాటు 50 కుటుంబాలకు ఉన్నాయి. కార్యక్రమంలో మండల కన్వీనర్ జయప్ప, బేవినహళ్లి ఆనంద్, కొండూరు సర్పంచి సిద్ధార్థ పాల్గొన్నారు.

శిక్షణకు హాజరైతే

ఆన్ డ్యూటీగా పరిగణించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-పెనుకొండ రూరల్

ఎన్నికల విధుల్లో భాగంగా పాఠశాల మొత్తం సిబ్బందికి నేడు, రేపు జిల్లా వ్యాప్తంగా పిఒ/ ఎపిఒలకు శిక్షణను ఇస్తున్నారు. ఈ శిక్షణకు హాజరైన ఉపాధ్యాయులకు ఆన్ డ్యూటీగానే పరిగణించాలే కానీ కంపెన్సేటివ్ సెలవుగా పరిగణించకూడదని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శెట్టిపి జయచంద్రారెడ్డి, ఎం.సుధాకర్ డిమాండ్ చేశారు. ఎలక్షన్ ట్రైనింగ్ రోజును మరొక సెలవు దినాల్లో పని చేయాలని చెప్పడం ఎన్నికల కమిషన్ నిబంధనలకు విరుద్ధం అన్నారు. కావున కంపెన్సేటివ్ సెల వును ఎత్తివేయాలని బుధవారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ అపూర్వ భరత్‌కి వినతి పత్రం అందజేశారు. స్పందించిన సబ్ కలెక్టర్ ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జిసి.నరేష్, సీనియర్ యుటిఎఫ్ నాయకులు నారాయణ స్వామి, గంగాధర్, శేషాద్రి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

పరిపూర్ణానందస్వామి

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని జిల్లా స్థాయి ప్రభుత్వాసుపత్రిలో రోగులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పరిపూర్ణానందస్వామి కోరారు. ఆయన బుధవారం ఆసుపత్రిని సందర్శించి రోగుల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. ఆసుపత్రిని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయి ఆసుపత్రిలో ఎక్స్‌రే, ఈసిజి, తదితర విభాగాల్లో తగినంత సిబ్బంది లేక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సీటీ స్కాన్ లేక సామాన్యులు వేలాది రూపాయాలు వెచ్చించాల్సిన పరిస్థితి ఉందన్నారు. తనను హిందూపురం ప్రజలు గెలిపిస్తే అధునాతన ఆసుపత్రిగా మారుస్తానన్నారు. హిందూ పురం అభివృద్ధి కోసం 'సప్తపది' అనే నినాదంతో ముందుకు సాగుతున్నానన్నారు. బిజెపి తరఫున టికెట్ ప్రకటిస్తే పార్టీ సింబల్‌తో ముందుకెళ్తానని, లేనిచో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ముదిగుబ్బ : వేసవి దృష్ట్యా ప్రజల బాటసారుల దాహార్తి తీర్చేందుకు ముదిగుబ్బలో వివిధ ప్రాంతా ల్లో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను బుధవారం ఎంపిడిఒ నాగశేషాచలరెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల నుంచి మండల కేంద్రానికి వచ్చే ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇఒఆర్‌డి కృష్ణకుమార్, పంచాయతీ సెక్రటరీ మంజుల, సిబ్బంది పాల్గొన్నారు.

యూనియన్‌కు ఆర్థికసాయం

తనకల్లు : మండలంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న శ్రీసత్యసాయి వర్కర్స్ యూనియన్ సభ్యుల కోరిక మేరకు సభ్యుల సభ్యత్వ రుసుం రూ. 10వేలను పారిశ్రామికవేత్త, వైసిపి నాయకులు ఎంజి రెడ్డి అందజేశారు. కదిరి నియోజకవర్గ వైసిపి యువ నాయకులు వినోద్‌కుమార్, సమరసింహారెడ్డి, ముబారక్, హరినాథ్‌రెడ్డి, జగదీష్ అందజేశారు. ఆ మొత్తాన్ని బుధవారం వారు స్థానిక సాయిబాబా ఆలయం వద్ద యూనియన్ అధ్యక్షులు విజయకుమార్, సభ్యులకు అందజేశారు.

పింఛను ఇంటి వద్దే పంపిణీ చేయాలి

ధర్మవరం టౌన్ : ఇంటి వద్దకే వెళ్లి వృద్ధులు, వికలాంగులకు పింఛను పంపిణీ చేయాలని నియోజకవర్గ బీఎస్పీ ఇన్‌ఛార్జి సాకే వినయ్‌కుమార్ కోరారు. పట్టణంలో బుధవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎండ తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో వారి ఇంటి వద్దకే వెళ్లి వీలైనంత తొందరగా అందరికీ పింఛను పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు అనవసర రాద్ధాంతాలు చేయకుండా ప్రజలకు పెన్షన్ ఎలా ఏర్పాటు చేయాలనే దానిపై స్పందిస్తే బాగుంటుందని హితవు పలికారు.

సత్యసాయి మహా సమాధిని దర్శించుకున్న బిఎస్ఎఫ్ ఐజి

పుట్టపర్తి : కేంద్ర సాయుధ బలగాల(బిఎస్ఎఫ్) ఐజి కైలాస్ చంద్రజాట్ బుధవారం సాయంత్రం సత్యసాయి బాబా మహాసమాధిని దర్శించుకున్నారు. అంతకుముందు ఐజిని ప్రశాంతి నిలయంలో శాంతి భవన్ అతిథి గృహం వద్ద జిల్లా ఎస్పీ మాధవరెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. వీరి వెంట ఎఆర్ డీఎస్పీ జెడ్.విజయ్ కుమార్ ఉన్నారు.



బిఎస్ఎఫ్ ఐజికి పూలబొకే ఇస్తున్నఎస్పీ మాధవరెడ్డి

నేరాలు ఘోరాలు

వాహనం ఢీకొని నాసన్ కూలీ మృతి

గోరంట్ల రూరల్ : పట్టణ సమీపంలో బుధవారం రోడ్డు దాటుతుండగా ఐచర్ వాహనం ఢీకొని రోడ్డు దాటుతున్న నాసన్ కంపెనీ కూలీ మృతి చెందాడు. సిఐ సుబ్బరాయుడు తెలిపిన వివరాలు.. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన మనోహర్ కన్వర్ భార్య సున్నతికన్వర్, పిల్లలతో కలిసి నాసిన్ అకాడమీలో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. వారు బుధవారం స్వగ్రామం వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా బెంగళూరు నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఐచర్ వాహనం ఢీకొనడంతో మనోహర్ కన్వర్(34) తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రథమ చికిత్స అనంతరం అనంతపురం సర్వజన ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి...

రొద్దం : మండలంలోని ఆర్.మరవపల్లి గ్రామానికి చెందిన కురుబ చిన్నయ్య(65) 8 రోజుల క్రితం పరిగి మండలంలోని ధనాపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. అతడికి హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం బెంగళూరుకు తరలించారు. అక్కడి డాక్టర్లు తలకు తీవ్ర గాయమైందని నయమయ్యే అవకాశం లేదని తెలపడంతో మళ్లీ హిందూపురంలోని విశ్వతేజకు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. దీంతో మృతదేహాన్ని సొంత గ్రామానికి తరలించారు.



చిన్నయ్య(ఫైల్‌ఫొటో)

గుండెపోటుతో రైతు మృతి

ముదిగుబ్బ : పట్టణంలోని పాత ఊరికి చెందిన గోనుగుంట్ల మల్లికార్జున(65) బుధవారం తన వ్యవసాయ భూమిలో వేరుశనగ గడ్డి మెషిన్‌లో ఆడిస్తుండగా అకస్మాత్తుగా గుండెనొప్పి రావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు మతుని కుటుంబ సభ్యులు తెలిపారు.

అల్లనేరేడు, మామిడి చెట్లు దగ్ధం

ఓబుళదేవరచెరువు : మండలంలోని ఎనుగూరు గ్రామంలో బుధవారం కాంగ్రెస్ నాయకుడు మనిగే మనోహర్‌నాయుడుకు చెందిన అల్లనేరేడు మామిడి చెట్లు అగ్ని ప్రమాదంలో దగ్ధమయ్యాయి. బాధితులు తెలిపిన వివరాలు.. రైతు రెండెకరాల పొలంలో అల్లనేరేడు, మామిడి చెట్లను నాలుగేళ్లుగా సాగు చేస్తున్నాడు. గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో చెట్లు అగ్నికు ఆహుతి కావడంతో రూ. 5 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు.

కేతిరెడ్డి నుంచి ధర్మవరాన్ని రక్షించుకుందాం

కూటమి అభ్యర్థి సత్యకుమార్, పరిటాల శ్రీరామ్

ధర్మవరం టౌన్ : కేతిరెడ్డి కబంధ హస్తాల నుంచి ధర్మవరం నియోజకవర్గాన్ని రక్షించుకుందామని కూటమి అభ్యర్థి సత్యకుమార్ పిలుపునిచ్చారు. అనంతపురం నగరంలోని పరిటాల శ్రీరామ్ నివాసం బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసిపి శ్రేణులు రాష్ట్ర వ్యాప్తంగా ఇసుక, మట్టి దోపిడీ చేస్తుంటే ఇక్కడ మాత్రం పంచభూతాలను దోపిడీ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక చెరువును కబ్జా చేసి విలాసవంతమైన ఇల్లు నిర్మించుకుని రైతుల నోట్లో మట్టికొట్టారని విమర్శిం చారు. ప్రతి దానికీ ప్యాకేజీ నిర్ణయించి ఇక్కడ ప్రజలను పట్టి పీడిస్తున్న పాలకులను పారదోలు దామన్నారు. పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ ధర్మవరంలో తొలిసారి ఓ బిసి అభ్యర్థి పోటీలో ఉన్నారని ఆయనను గెలిపించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు.



పాతచామలపల్లి ప్రచారంలో పాల్గొన్న ఎంపి అభ్యర్థి బోయ శాంతమ్మ

వైసిపి ఎంపి అభ్యర్థి శాంతమ్మ ప్రచారం

చిలమత్తూరు : చిలమత్తూరు పంచాయతీలోని సంజీవరాయినిపల్లి, పాతచామలపల్లి, ఆదేపల్లి గ్రామాల్లో బుధవారం వైసిపి ఎంపి అభ్యర్థి బోయ శాంతమ్మ, ఎమ్మెల్యే అభ్యర్థి భర్త వేణురెడ్డి ఎన్నికల ప్రచారం చేపట్టారు. శాంతమ్మ మాట్లాడుతూ వైసిపితోనే రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి సాధ్యమన్నారు. కావున మరోమారు వైసిపిని గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎంపిపి పురుషోత్తమరెడ్డి, నాయకులు అన్సర్, ప్రభాకర్‌రెడ్డి, ఎంపిటిసి రాఘవేంద్రరెడ్డి, సర్పంచులు తిరుమలేష్, లక్ష్మీపతిరెడ్డి, రామక్రిష్ణారెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, కోటమీద సురేష్‌రెడ్డి, సోమశేఖర్ పాల్గొన్నారు.

ఇంటింటికీ ఎమ్మెల్యే...

ముదిగుబ్బ : మండలంలోని చిన్నకోట్ల, ఎర్రగుంటపల్లి, మొగలచెట్లపల్లి గ్రామాల్లో బుధవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి ఇంటింటి ప్రచారం చేపట్టారు. గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు, అభివృద్ధిని వివరించి వైసిపిని గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఇందుకూరు నారాయణరెడ్డి, మండల కన్వీనర్ సివి.నారాయణరెడ్డి, గడ్డం వెంకటేశ్వర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి



కదిరి పట్టణంలోని 34వ వార్డులో ప్రచారం చేస్తున్న కౌన్సిలర్లు

కదిరిలో వైసిపి కౌన్సిలర్లు...

కదిరి టౌన్ : రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి వైసిపితోనే సాధ్యమని పలువురు ఆ పార్టీ కౌన్సిలర్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి మక్బూల్, ఎంపి అభ్యర్థిబోయ శాంతమ్మలకు మద్దతుగా వారు బుధవారం 34వ వార్డు కౌన్సిలర్ బొబ్బిలి రవి ఆధ్వర్యంలో పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాట్లాడుతూ పేదలకు మంచి జరిగితే చూడలేని వారంతా కూటమిగా ఏర్పడి బరిలోకి దిగితే, సిఎం జగన్ ఒంటరిగా ఎన్నికలకు సిద్ధమయ్యారని తెలిపారు. సామాన్యులకు సంక్షేమ పథకాలు అందాలన్నా, రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్.సలీమ, బత్తుల, పి.హసీన, సూర్యనారాయణాచారి, రవి, షాను, ఎస్కే.వలి, రాంప్రసాద్, నాగార్జునరెడ్డి, శేఖర్, నారాయణపాల్ పాల్గొన్నారు.

గ్రామ బోర్డు తొలగించిన వైసిపి నాయకులు

సోమందేపల్లి : మండలంలోని పత్తికుంట గ్రామంలో దశాబ్దాల కాలంగా 'పరిటాల రవీంద్ర నగర్' పేరుతో ఉన్న గ్రామ బోర్డును బుధవారం అదే గ్రామానికి చెందిన వైసిపి నాయకులు తొలగించి నట్లు స్థానిక టిడిపి నాయకులు తిప్పన్న, సోమశేఖర్, రామచంద్ర, రామాంజనేయులు పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ ఎవరికీ ఇబ్బంది లేకుండా రోడ్డు పక్కన ప్రభుత్వ స్థలంలో ఉన్న బోర్డును స్థానిక వైసిపి నాయకులు నరసింహులు తొలగించారని పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా ప్రశాంతమైన గ్రామంలో రాజకీయ కక్షలను ఉసిగొల్పడానికి ఇలాంటి పనులు చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.